బీచ్‌రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు

విశాలాంధ్ర - సాగర్‌నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధి బీచ్ రోడ్‌లో సీతకొండదరి విశాఖపట్నం నుండి బీచ్ రోడ్డు భీమిలి వెళ్లే మార్గంలో ఐ లవ్ వైజాగ్ బోర్డు ఎదురుగా ఉన్న కొండ మీద నుంచి కొండచరియలు విరిగిపడ్డాయి. తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారిపై బండరాళ్లు విరిగిపడ్డాయి. దీని కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ బండరాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విజయసాయిరెడ్డికే ఉత్తరాంధ్ర వైసీపీ పగ్గాలు

అధికార పక్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే నేత నియామకంపై కేడర్‌లో ఉత్సాహం



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సంస్థాగతంగా ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ రాబోయే ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి వార్డు స్థాయి వరకు వైసీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ సమన్వయకర్తల నియామకం చేపట్టారు. గత అధికార టీడీపీ పాలనలో ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా ఎంపీ విజయసాయిరెడ్డి ఉంటూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీకి 2019లో అత్యధిక స్థానాలు గెలిపించి అధికారం చేపట్టిన వెంటనే విశాఖ కేంద్రంగా రాజధాని పాలన అంటూ రాష్ట్రంలో రెండో ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించిన ఎంపీ సాయి రెడ్డికి మళ్ళీ ఉత్తరాంధ్ర పగ్గాలు ఆ పార్టీ అధినేత అప్పగించారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లు పాటు ఆయనే ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా ఉన్నారు. ఆఖరి రెండేళ్లు మరో ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా జగన్ నియమించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నియోజకవర్గ సమన్వయకర్తల ఎంపికతోపాటు ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కోవడంలో విజయ సాయిరెడ్డి వాక్చాతుర్యానికి ఎదురులేదని విపక్ష పార్టీ నేతలే అంటున్నారు. సంపూర్ణ రాజకీయ పరిజ్ఞానం కలిగిన విజయసాయిరెడ్డి రాష్ట్రంతోపాటు దేశంలో విశేష పలుకుబడి కలిగి కేంద్ర ప్రభుత్వంతో మంచి సత్సంబంధాలు కలిగి ఉన్న నేతగా విజయసాయిరెడ్డి మళ్లీ ఉత్తరాంధ్ర కేంద్రంగా సమన్వయకర్త బాధ్యతలు చేపడితే పార్టీకి పూర్వ వైభవం ఖాయమని వైసీపీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖలో విద్యా, వైద్యం, ఐటీతోపాటు రియల్ ఎస్టేట్ రంగాల్లో అగ్రగామిగా ఉండాలంటే విజయసాయిరెడ్డి ప్రణాళిక బద్ధంగా ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేస్తారని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖ కేంద్రంగా రాజధాని ప్రకటనలో విజయసాయిరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని, విజయసాయిరెడ్డి సమన్వయకర్తగా మళ్లీ విశాఖ కేంద్రంగా పనిచేస్తే పార్టీకి ఎలాంటి ఆటుపోట్లు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొంటారని, తాము కూడా పార్టీలు మారకుండా వైసీపీలో కొనసాగుతామని మరి కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈసారి నియోజకవర్గ సమన్వయకర్తలతో పూర్తిగా సమన్వయం చేసుకుంటూనే వారి అభీష్టానంకు అనుగుణంగా ప్రాంతీయ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి పనిచేస్తారని, ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు ఉంటాయని, ఏకపక్ష నిర్ణయాలు ఉండవని పార్టీలో అంతర్గత చర్చల ద్వారా పార్టీ బలోపేతానికి అందరం సమిష్టిగా కృషి చేస్తామని ఓ మాజీ ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ ఐదేళ్లు పార్టీని నడపడం కోసం అలాంటి నాయకులు ఉండాల్సిందేనని మరి కొంతమంది అంటున్నారు.

సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సీనియర్ డివిజన్ సివిల్ జడ్జ్ వెంకట శేషమ్మ తనిఖీ చేశారు. పాఠశాలలో అన్ని తరగతుల గదుల్లో ఉన్న విద్యార్థులను సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థుల మధ్యాహ్నం భోజన తయారీ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి విద్యార్థులతో కలిసి భోజనం చేసి రుచిని చూశారు. భోజన పథకం స్టాకు, రిజిస్టర్ నిర్వహణ మొదలగునవి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై ఫోక్సో చట్టంపై అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు మంచిది కాదన్నారు. మాదక ద్రవ్యాలు సేవించటం చట్ట ప్రకారం నేరమని, వారికి దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు.

ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపసర్పంచులకు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు జరుగుతుందని దాదాపు 66 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ సాధారణ పరిపాలన విధానం, గ్రామపంచాయతీలోని లేఔట్లు, ఏపీపీఆర్ 1994 చట్టం నిబంధనలు గ్రామ పంచాయతీలోను తాగునీటి సరఫరా, ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిళ్ళలు నిర్వహణ గ్రామపంచాయతీలో ఆర్థిక నిర్వహణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలు వాటి గురించి వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ జానకి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శులు శ్రీరామ్ మూర్తి, ఆర్కే నాయుడు, ధనుంజయ, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు బోల్తా: వాహనదారుల ఇక్కట్లు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని పైపులైన్ సమీపంలో ట్రక్కు బోల్తాపడింది. శ్రీహరిపురం, మల్కాపురం ప్రాంతాల్లో నివాసం ఉండేవారు ముఖ్యంగా డాక్ యార్డ్‌కు వెళ్లే ఉద్యోగులు గురువారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ క్రేన్ సాయంతో వాహనం తొలగించే వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.

అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - భీమిలి: రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపించిన అమనాం సహా ఇతర గ్రామాలను అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి హామీ పథకం కింద దాకమర్రి, బోడమెట్లపాలెం, అమనాంలలో రూ.77 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం అమనాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద మెజారిటీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని చెప్పారు. రోడ్లు, డ్రెయిన్లు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, రామా నాయుడు, గాదు వెంకటప్పుడు, డి.ఎ.ఎన్.రాజు, గంటా నూకరాజు, ఎంపీడీఓ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ద్వంద్వ వైఖరి విడనాడాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్రం ద్వంద్వ వైఖరి విడనాడాలని, ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 1344వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎస్.ఎం.ఎస్ 1, వాటర్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్, సి.ఎం.ఎం, సి.ఆర్.ఎం.పి, ఆర్ అండ్ డి, యుటిలిటీస్ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని మంత్రులు, ఎంపీలు ఉక్కును కాపాడతామని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప ఆచరణలో శూన్యమని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం జాతీయ సంపదని, ఈ సంపదను కాపాడే హక్కు కేంద్రానికి లేదా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారం మనుగడ సాగించాలంటే సెయిల్‌లో విలీనం చేయడమొక్కటే మార్గమన్నారు. తక్షణమే కేంద్రం విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తూ పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, మసేన్ రావు, డి.దేముడు, సి.హెచ్ శ్రీనివాసరావు, జాన్సన్, శంకర్రావు, కార్మిక నాయకులు గుమ్మడి నరేంద్ర కుమార్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజనలో ఒకసారే అవకాశం

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో లబ్ధిపొందిన వారికి 2.0లో గృహ సంబంధిత పథకంలో అవకాశం ఉండదని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల లేఅవుట్ ఇన్‌ఛార్జులు, ఇతర అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. అధికారులు, గుత్తేదార్లు సమన్వయంతో వ్యవహరించి లేఅవుట్లలో చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, సొంత స్థలంలో కట్టుకునే వారు కూడా త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హితవు పలికారు. పీఎం ఆవాస్ యోజన 2.0 కోసం ఆలోచిస్తూ కొంతమంది లబ్ధిదారులు ముందుకు రావటం లేదని అధికారులు ప్రస్తావించగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1.0లో లబ్ధి పొందిన వారికి 2.0లో అవకాశం రాదని, మార్పులు చేర్పులు ఉండబోవని స్పష్టం చేశారు. కొత్తవారికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు బాగా అర్థమయ్యేలా చెప్పాలని అధికారులు బాధ్యత తీసుకోవాలని, క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఒప్పించా లన్నారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు.

మహిళపై ఏఓ లైంగిక వేధింపులు

విశాలాంధ్ర - భీమిలి: మధురవాడ శిల్పరామంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.మేరీ అనే దళిత మహిళపై ఏఓ విశ్వనాథరెడ్డి లైంగిక వేధింపులకు పాల్పడటాన్ని మాల మహానాడు వ్యవస్థాపకులు బాగం గోపాలరావు తీవ్రంగా ఖండించారు. ఇదే కార్యాలయంలో గతంలో కూడా ఇలాంటి కుల వివక్ష చూపే విదంగా ప్రవర్తించారని ఇలాంటి వాటిపై కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో భాగంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిపించి దర్యాప్తు చేస్తే ఏఓ అక్రమాలు బయటకు వస్తాయని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని బాగం గోపాలరావు డిమాండ్ చేశారు.

గీతం ఆసుపత్రిలో నోటి కేన్సర్ శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - మధురవాడ: నోటి కేన్సర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురైన నగరానికి చెందిన 47 సంవత్సరాల వ్యక్తికి గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి మరియు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య నిపుణుల బృందం నిర్వహించిన శస్త్ర చికిత్స విజయ వంతమైంది. స్థానిక వాల్తేర్‌కు చెందిన బి.రామారావు నాలుక వెనక బాగంలో నెల రోజులుగా తీవ్ర నొప్పితో బాధపడుతూ గీతం ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షలలో ఆయన నోటిలో అల్సర్‌ను గుర్తించి బయాప్సీకి పంపగా నోటి కేన్సర్ బారిన పడ్డట్లుగా గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా నాలుకపై కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని తొలగించాలని నిర్ణయించారు. జిమ్సర్‌కు చెందిన ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ యుగందర్, గీతం దంత కళాశాలకు చెందిన ఓరల్ మరియు మాక్సియో ఫేషియల్ సర్జరి నిపుణులు డాక్టర్ రూపా గంట, డాక్టర్ సతీష్, డాక్టర్ సౌజన్య, విజయవంతంగా శస్త్ర చికిత్స ద్వారా కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని తొలగించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ పొగాకు సంబంధ ఉత్పత్తులు ముఖ్యంగా సిగరెట్, బీడి, చుట్టలతో పాటు గుట్కా, ఖైనీ, జర్దా వినియోగించే వారిలో నోటి కేన్సర్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. నోటి కేన్సర్‌పై అవగాహనకు, రోగులకు ఉచిత కౌన్సిలింగ్ ఇవ్వడానికి గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి లో ప్రత్యేక విభాగాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కాగా అరుదైన శస్త్ర చికిత్సను విజయ వంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని జిమ్సర్ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి గురువారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

సామాన్యులపై ధరల పిడుగు...

మండుతున్న నిత్యావసరాల ధరలు
ధరల అదుపు బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే
సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - కొమ్మాది: ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదు...ధరలిట్టా మండబట్టే...అంటూ పాడుకోవడం తప్ప ఇపుడు మరో దిక్కు లేకుండా పోతున్నదని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. సామాన్య మానవులపై ధరలు పిడుగులా ఉందని, నిత్యావసర ధరలు మండుతున్నాయని, ధరల అదుపు బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. మధురవాడ శివశక్తినగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. మన దేశంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగాయని, మోదీ 3వసారి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాపారస్తులు పండుగ చేసుకున్నారని, ధరల నియంత్రణ చేసే నాదుడు కరువయ్యారని అన్నారు. బ్లాక్ మార్కెట్‌లో విచ్చిల విడిగా వ్యాపారం చేసుకుంటున్నా అడిగే నాథుడు లేకుండా పోయారని, ఆగస్టు నెలలో 3.65 శాతంగా ఉన్న ద్రవ్యోల్బనం దసరా నాటికి 5.49 శాతానికి చేరుకుందని, దేశవ్యాప్తంగా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. సామాన్య జనం నోట్లోకి నాలుగువేళ్లూ పోవాలంటే గగనం అవుతుందని, ధరల భారం కోట్ల కుటుంబాలను పస్తులు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కూరగాయలైనా కేజీ వందకు చేరిందని, వంట నూనెలు సైతం భగ్గుమంటున్నాయన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ధరలు అదుపు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు ఎండి బేగం, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎస్కె సల్మా, బి.కేశవయ్య, రవి, వెంకటేశ్వరరావు, ఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - విశాఖ: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టలని కోరుతూ సీపీఐ కంచరపాలెం శాఖ ఆధ్వర్యంలో ధరలు పెరుగుదలపై గురువారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమం కంచరపాలెం ప్రాంతంలో 55వ వార్డులో జోగారావునగర్, తిక్కవానిపాలెంల్లో జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ ఉత్తర నియోజకవర్గ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కుతున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు పెను భారంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉత్తర నియోజక వర్గ సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణ రావు, కంచరపాలెం శాఖ కార్యదర్శి వి.నల్లయ్య, కంచరపాలెం శాఖ సభ్యుడు ఏఆదినారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి: రాష్ట్రంలో పెరిగిపోతున్న నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యులు వై.రాంబాబు ధ్వజమెత్తారు. గురువారం ఉదయం గోపాలపట్నం రైతు బజార్ దగ్గర సీపీఐ శ్రేణులు, కార్మికులతో కలసి రోజూ రోజుకి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల అధిక ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ అర్ధనగ్నంగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆకులు నములుతూ నిరసన వ్యక్తం చేశారు. రైతూ బజార్ లోపల ప్రదర్శన నిర్వహించి ధరలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నేతలు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో భారీగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణ, దళారి వ్యవస్థను అదుపు చేయడంలో, పూర్తి వైఫల్యం చెందారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా ప్రభుత్వం ప్రకటించి అధికారం చేపట్టిన తరువాత హామీలను నెరవేర్చకుండా నిత్యావసర సరుకులు ధరలు అమాంతం పెంచి ప్రజలపై పెను భారం మోపుతున్నారని మండిపడ్డారు. జిల్లా సీపీఐ నాయకులు వై.రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంకి మద్యం ధరల నియంత్రణపై ఉన్న ఆసక్తి నిత్యావసర వస్తువుల ధరలపై లేకపోవటం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అన్నపూర్ణ, పెందుర్తి ఏరియా నాయకులు ఎన్.అసిరినాయుడు, అరుణ, రాము, దుర్గారావు, సీపీఐ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల యాజమాన్యాలతో జీవీఎంసీ కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరంలో వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధికి అనుగుణంగా అదనపు అవసరాలకు సరిపడేలా కొత్తగా మంచినీటి పైప్ లైన్‌ను నిర్మించుటకు ప్రతిపాదన సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన కోరమాండల్ గెస్ట్ హౌస్‌లో నగరంలో గల పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో గల పరిశ్రమల అవసరాలకు సరిపడా మంచినీటిని సరఫరా చేయుటకు ప్రత్యేక పైప్ లైన్‌ను నరవ నుండి షీలా నగర్ మీదుగా పోర్ట్ రోడ్డులో 1300 ఎం.ఎం. వ్యాసం గల ఎమ్.ఎస్ పైప్ లైన్‌ను అమృత్ 2.0 పథకంలో భాగంగా పి.పి.పి పద్ధతిలో ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన సిద్ధం చేస్తున్నట్టు పరిశ్రమల ప్రతినిధులకు తెలిపారు. ప్రస్తుతం, భవిష్యత్తు అవసరాలకు వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధి కొరకు అనుగుణంగా అదనపు అవసరాలకు సరిపడా మంచి నీటిని సరఫరా చేయుటకు ఈ పైపులైనును నిర్మించుటకు ప్రతిపాదించడమైనదని, అందుకు నగరంలో గల పరిశ్రమల భాగస్వామ్యం చాలా అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పైపులైను నిర్మాణ ప్రతిపాదన విషయమై పరిశ్రమల ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ వారి కొరకు అదనపు మంచినీటి అవసరాలను తెలియజేస్తూ భాగస్వామ్య విధివిధానాలు త్వరలో తెలియజేస్తామని కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద్ రాజు, పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్.రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు సిహెచ్. ఏడుకొండలు, శేఖర్ జి.ఇ (ఐ) ఎన్.వై.సి.షిప్ బిల్డింగ్ సెంటర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, హిందుస్థాన్ కోల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎ.ఎం.ఎన్.ఎస్. ఇండియా లిమిటెడ్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. బ్రాంచ్ చిరునామా: డోర్ నం.54-20-10/1ఏ, 3వ అంతస్తు, గురునానక్‌కాలనీ, మెయిన్‌రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్‌ఎదుట, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520008, www.hindujahousingfinanacc.com

డిమాండ్ నోటీసు

మీరు, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు ఈ కింద వివరించినట్లుగా మీ యొక్క స్థిర ఆస్తి(లు)ని తనఖా పెట్టుట ద్వారా ఆస్తి సౌకర్యం(లు)పై హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుండి హోమ్‌లోన్/లోన్ వినియోగించుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనారు; మీ రుణాలు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. బకాయి పడిన మొత్తాలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద చివరిగా తెలిసిన మీ యొక్క చిరునామాలకు పంపిన డిమాండ్ నోటీసు అందజేయబడక తిరిగి పంపబడినది. అందుచేత ప్రత్యామ్నాయ సర్వీసుగా ఈ నోటీసులోని అంశాలను సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 నిబంధన 3(1)తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇచ్చట ప్రచురించబడుచున్నవి. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీలు, మొత్తం బకాయిలు, సెక్షన్ 13 (2) కింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయిమ్ చేసిన మొత్తం మొదలైన వాటి వివరాలు ఈ కింద ఇవ్వబడ్డాయి :

వ.సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/ రుణఖాతా సం./రుణం మొత్తం/బ్రాంచ్	ఎన్‌పీఏ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం
1	1.శ్రీ చింతకాయల గోవింద్....రుణగ్రహీత 2.శ్రీమతి చింతకాయల గౌరీ రత్నం.... సహ-రుణగ్రహీత, అర్/ఓ. 2-58, పుడిమడక, పెద్దూరు, అచ్యుతాపురంమండలం, పుడిమడక, రూరల్, అనకాపల్లి, ఏపీ-531011. రుణఖాతా సంఖ్య: AP/VKP/VSKP/A000000609	05.09.2024	15.10.2024 & తేదీ :11.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.7,47,016/- (ఏడు లక్షల నలభై ఏడు వేల పదహారు రూపాయలు మాత్రమే)
	అసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: అనకాపల్లి జిల్లా, యలమంచిలి ఎస్‌ఆర్‌ఓ పరిధి, అచ్యుతాపురం మండలం, పుడిమడక గ్రామంలో గ్రామకంఠం సర్వే నం.128/1 ద్వారా వ్యాపించియున్నది, అసెస్‌మెంట్ నం.550, 700 చదరపు అడుగుల్లో నిర్మించిన డోర్ నం.4-102 ఆధారంగా ఉన్న ఆర్‌సిసి పైకప్పు ఇల్లుతో కలిసి 104.72 చదరపు గజాలు లేదా 87.55 చదరపు మీటర్ల కొలత స్థలం మొత్తంగా. హద్దులు ఈ కింది విధంగా: హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: యెర్రిపల్లి ముసలయ్య ఇల్లు, పడమర: యెర్రిపల్లి గంటలరావు ఇల్లు, ఉత్తరం: రోడ్డు 1.1. యలమంచిలి ఎస్‌ఆర్‌ఓ. నందు 1.1. రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు నం.6020/2022, తేదీ: 25-06-2022.		
2	1.శ్రీ అకుల వెంకట బాల శివకృష్ణ....రుణగ్రహీత 2.శ్రీమతి అకుల ఈశ్వరమ్మ.... సహ-రుణగ్రహీత, అర్/ఓ. డోర్ నం. 17-35-30-10, పితానివానిపాలెం, పెదగంట్యాడ పోస్ట్, నడుపూరు, విశాఖపట్నం, ఏపీ-530044 రుణఖాతా సంఖ్య: AP/VKP/VSKP/A000000691	05.09.2024	15.10.2024 & తేదీ :11.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.10,13,903/- (పదిలక్షల పదమూడు వేల తొమ్మిది వందల మూడు రూపాయలు మాత్రమే)
	అసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పరిధి, జీవిఎంసి, విశాఖపట్నం పరిధిలో పెదగంట్యాడ గ్రామం & మండలం యాతపాలెం ఏరియాలో ఉన్న సర్వేనం.159/1 ద్వారా వ్యాపించియున్నది, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నం.1111921274-017154, వాటర్ అసెస్‌మెంట్ నం.1086225177, పాత అసెస్‌మెంట్ నం.520100/1088135303, కొత్త అసెస్‌మెంట్ నం.1086294698, డోర్ నం.17-35-30/23/1 ఆధారంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో 950 చదరపు అడుగుల నిర్మిత ఫ్లింత్ ఏరియా ఆర్‌సిసి పైకప్పు ఇల్లు మరియు మొదటి అంతస్తులో 600 చదరపు అడుగుల నిర్మిత ఫ్లింత్ ఏరియాతో ఏసిసి టిన్ షెడ్ కలిగియున్న 120 చదరపు గజాలు లేదా 100.35 చదరపు మీటర్ల విస్తీర్ణపు కొలత స్థలం మొత్తంగా. మొత్తం స్థలం యొక్క హద్దులు: తూర్పు: దస్తావేజుదారుకు చెందిన స్థలం, దక్షిణం: ఎస్.కనకరాజుకు చెందిన ఇల్లు, డోర్ నం.17-35-30/6, పడమర: టి.దిల్లేశ్వరికి చెందిన ఇల్లు, డోర్ నం.17-35-30/23/2, ఉత్తరం: సి.సి. రోడ్డు. పెద గంట్యాడ ఎస్‌ఆర్‌ఓ. నందు 1.రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు నం.6088/2022, తేదీ: 18-11-2022.		

చట్టంలోని సెక్షన్ 13(2) కింద నోటీసు జారీ చేసిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో మొత్తం బాకీ చెల్లించవలసిందిగా పై రుణగ్రహీత/లుకు సూచించడమైనది. విఫలమైన పక్షంలో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన ప్రస్తావించిన 13 (2) సెక్షన్ కింద జారీ చేసిన నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన పిమ్మట తదుపరి చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

తేదీ : 18.10.2024, ప్రదేశము : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర
పేజి : 2
విశాఖపట్నం
శుక్రవారం 18, అక్టోబర్, 2024

వాల్మీకి ప్రభావం సమాజంపై వుంది: జెడ్పీ సీఈఓ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మహాకవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన ఆదర్శాలు మన సమాజంపై ప్రభావాన్ని చూపిస్తుందని జెడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి అన్నారు. జిల్లా ప్రజా పరిషత్, సమావేశ మందిరంలో మహాకవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పి.నారాయణమూర్తి మహాకవి వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అంటే కేవలం ఒక కవి మాత్రమే కాదు, అతను ఒక మహానుభావుడు, జీవితం గురించి లోతైన అవగాహన కలిగిన వ్యక్తి అని, అతను రచించిన రామాయణం మన భారతీయ సంస్కృతికి ఒక అద్భుతమైన నిధి, రామాయణం కేవలం ఒక కథ మాత్రమే కాదు, అది మన జీవితాలకు ఒక దిక్సూచి అని కొనియాడారు. పంచాయితీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యస్. సత్తి బాబు మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో మనం ఎన్నో

మార్పులను చూస్తున్నామని, ఈ మార్పుల మధ్యలో మనం మన సంస్కృతి, విలువలు, ఆదర్శాలను మరచిపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రతన్ టాటాకు గోపాలపట్నం కళాసేవాపీఠం నివాళి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ దివంగత భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకి గోపాలపట్నం కళాసేవా పీఠం ఘనంగా నివాళు లర్పించింది. కార్యక్రమంలో బాగంగా వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా గ్రూప్ చైర్మన్‌గా విశేషంగా రాణించి ప్రపంచ ప్రఖ్యాత న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టాటా కంపెనీ లిస్టింగ్‌కు కారకుడైన అపార మేధాశక్తి సంపన్నుడు రతన్ టాటా అని కొనియాడారు. అధ్యక్షులు గొరకల రామదాసు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలు పాటించే మహోజ్వలమైన పారిశ్రామికవేత్తను భారతదేశం కోల్పోయిందని ప్రస్తుతిం చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ ఉపాధ్యక్షులు కె.ఎస్.ఆర్.రావు, ఆర్గనైజర్ కె.వెంకట్, వల్లూరి జగదీష్, చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, టి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సెంచరీ పరుపుల షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్థానిక రేసపువాని పాలెంలో భారత దేశపు సెంచరీ మ్యాట్రెసెస్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్, అగర్వాల్ కంఫర్ట్స్ ఆవిష్కరించారు. ఈ స్టోర్‌ను విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెంచరీ మ్యాట్రెసెస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఉత్తమ్ మలానీ పాల్గొన్నారు. నూతన స్టోర్ ఆవిష్కరణ సందర్భంగా అన్ని రకాల పరుపులు పైన 15 శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. రూ.15, 000/- వరకు విలువైన ఉచిత బహుమతులను కూడ అందజేస్తున్నామన్నారు. విశాలమైన స్టోర్ లో సామాన్య పరుపులు దగ్గర నుంచి అత్యంత విలాసవంతమైన పరుపులు వరకు అన్ని ఒకేచోట లభిస్తాయన్నారు. మూడు దశాబ్దాలుగా వారసత్వంగా విస్తరిస్తున్న సెంచరీ పరుపులు భారతదేశంలో ప్రసిద్ధిగాంచినవని, సుఖవంతమైన నిద్రకు సౌకర్యవంతమైన పరుపులుగా పేరొందినవని చెప్పారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - పెందుర్తి: పులగాలిపాలెంలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం, గిరిజన బాలుర వసతిగృహాలను జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాదికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు వసతిగృహాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వార్డెన్లు సూర్యప్రకాశరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్బన్ క్రూయిజర్ టైజర్ లిమిటెడ్ ఎడిషన్ విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ - విశాఖపట్నం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ యొక్క లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్ ప్రీమియం నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. కస్టమర్లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ. 20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజీతో వస్తుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు.

ఆదర్శ్‌లో ఉన్నత భారత అభియాన్ అకడమిక్ ఆడిట్

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఉన్నత భారత్ అభియాన్ ఆడిట్ నిర్వహించబడిందని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ తెలియజేశారు. యుబిఎ అకడమిక్ ఆడిట్‌ను డాక్టర్ బి.పావని, రీజనల్ కోఆర్డినేటర్, ఉన్నత భారత్ అభియాన్ ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నత అభియాన్ విశిష్టతను, యుబిఎ ద్వారా ఆదర్శ్ చేసే కార్యక్రమాలను ముఖ్య అతిథి డాక్టర్ బి.పావని వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఉన్నత భారత అభియాన్ ద్వార 5 గ్రామాలను ను దత్తత తీసుకున్నారని యుబిఎ ద్వారా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతు న్నామని గ్రామ అభివృద్ధికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని తెలియజేశారు.

మహర్షి వాల్మీకి జీవితం భావితరాలకు అవసరం

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మహా జ్ఞాని, తాత్వికుడు, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రచించి అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేసిన మహాకవి మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ జీవితానికి అనువైన విధంగా వాల్మీకి రామాయణాన్ని రచించి ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని గుర్తు చేశారు. కారణ జన్ముడిగా నిలిచిన ఆయన రామాయణం నిలిచినంత కాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, వాల్మీకి సంఘ నాయకులు, ఇతర అధికారులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సరిపల్లిలో పల్లె పండుగ

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని సరిపల్లి, జంగాలపాలెం, రాజీపేట, జంగాలపాలెం గ్రామాలలో పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఎంపీడీవో, ఎమ్మార్వో, పంచాయతీరాజ్ డీఈ, ఏఈ, గ్రామ పంచాయతీల సెక్రటరీలు, సర్పంచులు ఎంపీటీసీలు మాజీ జడ్పిటిసి సభ్యులు రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మూడు పార్టీలకు సంబంధించిన మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రమేష్ బాబు శంకుస్థాపనలు చేశారు.

శెట్టిబలిజ వీధిలో అన్నసమారాధన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 61వ వార్డు శెట్టి బలిజ వీధి వద్ద నిర్వహించిన దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పివి గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు మజ్జి సోమేష్, సీనియర్ నాయకులు పోల్ రెడ్డి, ఉరుకూటి పైడిరాజు, సంఘ సభ్యులు భవానీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంధాలయానికి పుస్తకాల బహుకరణ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయానికి సుజాతనగర్‌కి చెందిన బలివాడ కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్ కుటుంబ సభ్యులు వివిధ కేటగిరీకి చెందిన నవలలు, సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలను బహూకరించారు. ప్రజల వినియోగం నిమిత్తం పెందుర్తి శాఖ గ్రంధాలయానికి విలువైన పుస్తకాలను వారు బహుకరించారని గ్రంధాలయ అధికారిణి తెలిపారు.

తూర్పు నౌకాదళ కమాండ్‌ను సీఎన్ఎస్ సందర్శన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను నావికాదళ ప్రధానాధికారి చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, సతీమణి శశి త్రిపాఠి సందర్శించారు. ఈఎన్ఎస్ వద్ద అత్యాధునిక 1-3 జెట్టీని ప్రారంభించారు. ఈ జెట్టీ, అన్ని ఆధునిక మద్దతు లక్షణాలతో, ఈఎన్‌సీ యొక్క సముద్ర మౌలిక సదుపాయాలను పెంపొందిస్తుంది. సమీప భవిష్యత్తులో చేర్చబడుతున్న నౌకలకు అదనపు బెర్తింగ్ స్థలాన్ని అందిస్తుంది.

అమేజాన్ ఫ్రెష్‌కి ముఖ్యమైన మార్కెట్‌గా విశాఖ

విశాలాంధ్ర- విశాఖపట్నం: అమేజాన్ ఇండియా గ్రేట్ ఫెస్టివల్ సమయంలో, విశాఖపట్టణం అమేజాన్ ఫ్రెష్ కోసం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వృద్ధి చెందిందని అమెజాన్ ఫ్రెష్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్ చెప్పారు. 2024లో ప్రభావితపరిచే 2.3 రెట్ల ఇయర్-ఆన్-ఇయర్(వై ఓ వై) వృద్ధిని సాధించిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయంలో, కస్టమర్లు కిరాణా సరుకులపై ఫ్లాట్ రూ. 400 క్యాష్ బాక్‌ను, అమేజాన్ ఫ్రెష్‌పై 50 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు అన్నారు. విశాఖలోని వినియోగ దారులు నిత్యావసరాలను నిల్వ చేసుకోవడం మాత్రమే కాకుండా ఆరోగ్య కరమైన ఎంపికలను కూడా అనుసరిస్తున్నారన్నారు.

19న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్ 2

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ ఘనంగా నిర్వహించింది. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారం భమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మేఘ సందేశం సీరియల్ నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చిందన్నారు. యాంకర్ వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్ వీక్షకుల్లో ఉత్సాహంనింపిందన్నారు. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగిందన్నారు. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారన్నారు.తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫామెన్స్ షోకి హైలెట్గా నిలిచాయన్నారు. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మీప్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ,సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రతిష్ఠాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకావాలన్నారు.

ఆన్లైన్ బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించిన

సైబర్ క్రైమ్ పోలీసులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మూడు కంపెనీలపై సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. గుజరాత్ రాష్ట్రం, అహ్మదాబాద్‌కు చెందిన సైబర్ క్రైమ్ పోలీస్ ఐ4సి సమన్వయంతో వారు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఉత్తర్వుల మేరకు పోలీసులు ఆర్బిఐ చేత అనుమతి లేని అనేక బెట్టింగు, ఇన్వెస్ట్మెంట్ స్కామ్ మోసాలకు ఉపయోగపడుతున్న "పీస్ పే" అనే అక్రమ చెల్లింపు అగ్రిగేటర్ను పట్టుకున్నారు. స్టాక్ మార్కెట్ స్కామ్లు, టాస్క్- బేస్డ్ స్కామ్లు మరియు బెట్టింగ్ యాప్లతో సహా పలు స్కామ్లను చేస్తున్న చైనా జాతీయుల నియంత్రణలో ఉన్న భారతీయ వ్యక్తులు కాల్ సెంటర్ను నిర్వహిస్తున్నారని కేంద్ర ఏజెన్సీల నుండి సమాచారం మేరకు నగర పోలీస్ కమిషనర్ అనుమతితో డిప్యూటీ కమీషనర్ అజిత, డిసిపి (లా అండ్ ఆర్డర్-1)లు ఇన్స్పెక్టర్ ఆఫ్ సైబర్ క్రైమ్స్, విశాఖపట్నం సిటీ టాస్క్ ఫోర్సు సిబ్బందితో కలిసి విశాఖపట్నంలోని ఏఎన్ బీచ్ హాస్పిటల్ పక్కన ఉన్న ఫ్లాట్ నంబర్ జి-2, సి స్టైల్ అపార్ట్మెంట్లో దాడి చేసి, 10 ల్యాప్‌టాప్లు, 10 కంప్యూటర్లు, వందల కొద్ది బ్యాంక్ ఖాతా బుక్‌లు, సిమ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకోగా వారిలో నలుగురు అమ్మాయిలు ఉన్నారు. ఈ ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సిపి మాట్లాడుతూ ప్రధాన నిందితుడు సాయిరామ్, తైవాన్‌లో నివాసం ఉంటున్న అతని స్నేహితుడు సూర్య మోహన్, వియత్నాం తో కలిసి ఆర్బిఐ అనుమతి లేకుండా పేమెంట్ గేట్వే నిర్వహిస్తూ, రిజిస్టర్ కాని సిమ్ కార్డు, మ్యూల్ ఖాతాలను గుర్తుతెలియని మూలాలు చైనా వ్యక్తుల నుండి కొరియర్ ద్వారా పంపించడం ద్వారా ఈ చైనీస్ వ్యక్తులు అందించిన ఖాతాలలో మొత్తాలను క్రెడిట్ చేయడానికి ఇవి ఉపయోగించబడ్డాయన్నారు. అధిక లాభాల ముసుగులో ప్రధాన నిందుతులు అయిన ఏ1, ఏ2 లు చైనీస్ సంస్థలతో దగ్గరి సంబంధం కలిగి ఉండి చైనీస్ ఆపరేటర్ల నుండి అనుమతి లేకుండా యాక్సెస్ చేయలేని టెలిగ్రామ్ ఛానెల్ల ద్వారా కమ్యూనికేట్ చేస్తూ అమాయక బాధితులతో మోసపూరిత లావాదేవీలను నిర్వహించడానికి అనేక మంది యువతులతో ఆన్లైన్ బెట్టింగ్ ప్రమోషన్ల కోసం కాల్ సెంటర్ను నిర్వహించారన్నారు. దీనికి సాయిరామ్, సూర్య మోహన్ మద్దతుతో వీరు లక్కీ కిస్మత్ బెట్టింగ్ యాప్ బృందం నుండి సిమ్లను పొంది ఈ మోసాలలో సహాయం చేయడానికి ఇతర బెట్టింగ్ యాప్‌లో పాల్గొన్న చైనీస్ వ్యక్తులతో పరిచయాలను ఏర్పరచుకున్నారన్నారు. ఈ యువతులకు ప్రతి నెలా 25 వేల రూపాయలు జీతంగా అందిస్తూ ఈ స్కామ్‌లో చైనీస్ ఆపరేటర్లు భారతీయ పౌరులను భారీ లాభాల వాగ్దానాలతో ప్రలోభపెట్టడం ద్వారా కోట్లాది రూపాయలను మోసం చేస్తారన్నారు. ఈ సందర్భంగా సమర్థవంతమైన దాడులను నిర్వహించిన సైబర్ క్రైమ్స్, టాస్క్ ఫోర్స్‌కు చెందిన ఇన్స్పెక్టర్లనూ వారి సిబ్బందిని సిపి అభినందించారు.

స్నేహ భావాన్ని పెంపొందించేవి క్రీడలే

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్

విశాలాంధ్ర - పీఎం పాలెం: స్నేహ భావాన్ని పెంపొందించేవి క్రీడలేనని విశాఖకు చెందిన యువత ప్రతిఒక్కరు సామాజిక స్ఫూర్తితో.. చెడు మార్గంలో వెళ్లకుండా క్రీడా స్ఫూర్తిని చాటడం శుభపరిణామమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్ అన్నారు. వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ చైర్మన్ బైబిల్ ప్రసాద్,వైస్ చైర్మన్ రాజేష్, అధ్యక్షులు నక్కాశ్రీధర్ ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ స్టేడియం వేదికగా నవంబర్ 23 నుండి 30వ తారీకు వరకు వారం రోజుల వరకు వివిఎస్‌పిఎల్ క్రికెట్ పోటీలకు సంబంధించి ఆటగాళ్ల వేలం గురువారం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ వేలంలో ఆంధ్ర తెలంగాణ ఒరిస్సా నుండి వివిధ కేటగిరీలలో సుమారు 225 ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఈ వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు 8 ఫ్రాంచైజీలు మధురవాడ వారియర్స్, వెంకీ-11, పోలమాంబ-11, పివిఆర్ లయన్స్, మద్దిలపాలెం బ్లాస్టర్స్, మార్కాపూర్ వారియర్స్, వైజాగ్ వారియర్స్, హెచ్.ఆర్.ఏ.మావేరిక్ క్రీడాకారుల వేలంలో పోటీపడ్డారు. పోటీలలో మొదటి స్థానం సంపాదించిన క్రికెట్ టీంకు 5లక్షలు, ద్వితీయ స్థానంకు 3లక్షలు, ఉత్తమ ప్రదర్శన క్రీడాకారుడు 50 వేల రూపాయలు ప్రైజ్ మనీగా నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్, విజ్ఞిస్ అధినేత తాలశిల విజయ్ మోహన్, గోదావరి టైటిల్స్ హరీష్ మాట్లాడుతూ ఈతరం యువత క్రీడల పట్ల మక్కువ చూపడం ఎంతో విశేషమన్నారు. ఆరోగ్యవంతమైన ఆటలతో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్. పి.ఎల్. ఉపాధ్యక్షులు అక్రమాని లోవరాజు, పృథ్వి, కమిటీ సభ్యులు జగపతి, నరేష్, పోలిమటి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్.ఎల్.కెనాల్ అభివృద్ధి పనులకు

ప్రణాళికలు సిద్ధం చేయండి

- జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్ 4 పరిధిలో గల ఎస్.ఎల్.కెనాల్ అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన సీ హార్స్ జంక్షన్ నుండి ఉన్న ఎస్.ఎల్.కెనాల్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ జోన్-4 పరిధిలో 2.2 కిలోమీటర్ల ఉన్న ఎస్.ఎల్.కెనాల్ ఒక కిలోమీటర్ వరకు కచ్చా రోడ్డు కలిగి ఉందన్నారు. భారీవర్షాలు, తుఫానులు సంభవించేటప్పుడు కెనాల్‌లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని దాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీస్ యాజమాన్యంతో చర్చలు జరిపి ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజును కమిషనర్ ఆదేశించారు. కెనాల్ చివరన ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించి అక్కడ కెనాల్ నిర్మాణానికి కలుగబోయే అడ్డంకులను తొలగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన ఇంజనీర్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం సీ హార్స్ జంక్షన్ నుండి ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ పి.వి.వి.సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జీవీఎంసీ అధికారులు ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయరు, జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు రాష్ట్ర వేడుకగా ఘనంగా జీవీఎంసీలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహర్షి వాల్మీకి బెంగాలీ నెల అశ్విన్‌లో శరదృతువు పౌర్ణమి రోజున బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారని, సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల కవి అని, ప్రసిద్ధ హిందూ ఇతిహాసం రామాయణం వెనుక సూత్రధారి అని, సంస్కృత సాహిత్యంలో మొట్టమొదటి కవి 'ఆది కవి' అనే బిరుదును కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్ జైన్, జివిఎంసి అదనపు కమిషనర్లు ఎస్.ఎస్.వర్మ, డి.వి.రమణమూర్తి, ఆర్.సోమనారాయణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవ రెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, డిపిఓ ఎం.వి.డి.ఫణిరామ్, కార్యదర్శి బి.వి.రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఐడికి తెలుగు శక్తి ఫిర్యాదు

విశాలాంధ్ర- విశాఖ సిటీ: ప్రజా ప్రతినిధులు వస్తుంటారు.. వెళుతుంటారని కానీ అధికారులు మాత్రం పూర్తికాలం సర్వీసులో కొనసాగుతుంటారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. అందుకే అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా.. ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు తలవంచకుండా పనిచేయాల్సి ఉందన్నారు. అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై ఆధారాలు లేకుండా కేసు నమోదు చేయడం.. ఈ క్రమంలోనే ఆయన అరెస్టు కావడం.. తమ అభిమాన నాయకుడు కష్టాలలో ఉన్నారని ఆందోళనతో కొందరు అభిమానులు ప్రాణాలు కోల్పోవడం.. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం తదితర అంశాలపై బి.వి.రామ్ విశాఖ కేంద్ర కారాగారం సమీపంలోని పైనాపిల్ కాలనీలో ఉన్న సిఐడి కార్యాలయంలో ఎడిషనల్ ఎస్పి జి.ప్రేమ్ కాజల్ గురువారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఎడిషనల్ ఎస్పి జి.ప్రేమ్ కాజల్ కలిసిన వారిలో బొడ్డేపూడి దొరబాబు, డాక్టర్ పప్పుర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఎల్వీపీఈఐ

నేత్ర సంరక్షణ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: రోగుల ఇంటివద్ద సమగ్ర నేత్ర సంరక్షణను ప్రత్యక్షంగా అందించే ఉద్దేశ్యంతో "ఎల్విపిఇఐఏహెరామ్" అనే పేరుతో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) నేత్ర వైద్య సేవలు ప్రారంభించింది. ఈ మేరకు ఎల్వీపీఈఐ స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ తో భాగస్వామ్యం చేసుకుంది. ఈ సందర్భంగా ఎల్విపిఇఐ ప్రతినిధి డా ప్రశాంత్ గర్గ్, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ ప్రతినిధి కరుణా భాటియా మాట్లాడుతూ ముఖ్యంగా వృద్ధులు, చలన సంబంధిత సమస్యలున్నవారికి నాణ్యమైన కంటి ఆరోగ్య సంరక్షణ అందుబాటును వృద్ధి చేయడానికి "సీయింగ్ ఈజ్ బిలీవింగ్" కార్యక్రమంపట్ల బ్యాంక్ నిబద్ధతలో ఈ కార్యక్రమం ఒక కీలక భాగం అన్నారు. వృద్ధుల సంరక్షణలో పెరుగుతున్న డిమాండ్ తీర్చడానికి, సాంప్రదాయక ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై ఒత్తిడిని తగ్గించడానికి ఎల్విపిఇఐ ప్రాంగణంలు నుంచి నడపబడే ఎల్విపిఇఐఏహెరామ్ వంటి వినూత్న ఆరోగ్య సంరక్షణా నమూనాలు కీలకమైనవిగా చెప్పారు.

ఎల్విపిఇఐఏహెరామ్ సేవలు సంస్థకు ఒక ఫోన్ కాల్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చునని, దాని తరువాత శిక్షణపొందిన ఒక విజన్ టెక్నీషియన్ లేదా ఆప్టోమెట్రిస్ట్ రోగి ఇంటిని సందర్శించి, ఒక సమగ్ర కంటి పరీక్ష చేస్తారని తెలిపారు.

పి.కొవ్వాడ డీలర్ మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పి కొవ్వాడ గ్రామానికి చెందిన. రేషన్ షాపు డీలర్ పి.బంగారు శెట్టి గురువారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఈయన 1988 నుండి ఆ గ్రామానికి రేషన్ డీలర్ గా ఎంపికై ఇప్పటివరకు డీలర్ గా కొనసాగారు. అయినా 1955లో జన్మించారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలోనే నిర్వహించారు. మండల డీలర్ సంఘం అధ్యక్షులు సత్తిబాబు. జిల్లా డీలర్ సంఘం ఉపాధ్యక్షులు బి రమేష్. పలు గ్రామాల నుండి రేషన్ షాప్ డీలర్లు. బంగారు నాయుడు సత్యనారాయణ లక్ష్మి రామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు .

అనాథ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర- గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 90వ వార్డ్ లోని ఎన్ ఏ ది ఆల్ఫా హొటల్ ఎదురుగా ఫ్లై ఓవర్ క్రింద 38 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తికి వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా ఎయిర్పోర్ట్ జోన్ పోలీస్ వారికి సమాచారం అందిన వెంటనే, ఎయిర్పోర్ట్ జోన్ పోలీస్ వారు మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో అనాథ గా భావించి అనాథలు చనిపోతే పెద్ద మనసుతో అంతిమ సంస్కారాలు నిర్వహించే 90వ గారిని సంప్రదించగా, బొమ్మిడి రమణ గారు మానవతా దృక్పథంతో హిందు సంప్రదాయం ప్రకారం మృతుని కి అంతిమ సంస్కరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ జోన్ కానిస్టేబుల్ శివ సాగర్, పోతల సతీష్, నరసింహ,సాయి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస ఎస్ సి కాలనీకి చెందిన గోక. గురుఈశ్వరరావు గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పంచాయితీ పరిధిలో స్వీపర్ గా విధులు నిర్వహిస్తూ కుటుంబ పోషణ చేసేవాడు. కాగా కుటుంబ తగాదాలతో బుధవారం రాత్రి దోమల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా భార్య రమాదేవి కేజీహెచ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కేసును భీమిలి ఎస్సై ఎస్. గౌరీ దర్యాప్తు చేయగా సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మరణించారని స్పష్టం చేశారు.

డిసిపి 2 ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం, కంచరపాలెం మరియు ఎయిర్పోర్టు పోలీస్ స్టేషన్లను డి. మేరీ ప్రశాంతి, ఐ.పీ.ఎస్, డి.సి.పి-2 ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోపాలపట్నం, కంచరపాలెం , ఎయిర్పోర్టు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు..

కబ్జాదారులు కోరల్లో ప్రభుత్వ భూమి

జూనియర్ కాలేజ్ స్థలాన్ని కాజేస్తున్న ఆక్రమణదారులు
కోట్లలో ధర పలికే స్థలంపై అక్రమార్కుల కన్ను.....?

విశాలాంధ్ర - ఆనందపురం: మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు కేటాయించిన సర్వేనెంబర్ 276 లో సుమారు ప్రభుత్వ భూమిని ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 2 ఎకరాల 40 సెంట్లు, జిల్లా సైనిక్ బోర్డుకు 50 సెంట్లు, ఎక్సేంజ్ కార్యాలయానికి 40 సెంట్లు భూమిని అప్పట్లో కేటాయించారు. కోట్లలో విలువచేసే ప్రభుత్వ భూమి పై కబ్జాదారులు కన్ను పడింది. పలుమార్లు రెవెన్యూ అధికారులు స్థలాన్ని ఖాళీ చేయమన్నప్పటికీ కబ్జాదారులు బెదరడం లేదు. ఈ విషయంపై పలు సమావేశాల్లో మండల నాయకులు కలెక్టర్, ,జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. మండలి సర్వసభ్య సమావేశాల్లో ఎన్నిసార్లు హద్దులు వేయమని వినతిపత్రం సమర్పించిన ప్రయోజనం లేకపోయింది. తర్వాత ఈ విషయాన్ని శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు తెలియపరిచినప్పటికీ రెవెన్యూ అధికారులతో మాట్లాడిన సమస్య పరిష్కారం కాలేదని నాయకులు చెబుతున్నారు. విశాఖ కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం కాలేదని ఫిర్యాదు దారులు వాపోతున్నారు. ప్రభుత్వ స్థలాలకే రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏంటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కళాశాలకు కేటాయించిన స్థలంలో కొంతమేర ఆక్రమణలు ఉన్నప్పటికీ తొలగించకపోవడం అనుమానాస్పదంగా ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలానికి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుచున్నారు.

కణితి పాఠశాలను సందర్శించిన పల్లా

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కణితి పాఠశాలను గాజువాక నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పల్ల శ్రీనివాసరావు గారు కణితి పాఠశాలకు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 ఇయర్స్ బాల బాలికల నెట్ బాల్ టోర్నమెంట్ ను ఉద్దేశించి పర్యవేక్షణ చేశారు స్థానిక 87వ కార్పొరేటర్ అయినటువంటి బొండా జగన్నాథం ఈ టోర్నమెంటుకు కావలసినటువంటి మౌలిక సదుపాయాలను, అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి శాసనసభ సభ్యులైన పల్ల శ్రీనివాసరావుకి బోండా జగన్నాథం తెలియజేయడం జరిగింది. ఈ టోర్నమెంట్ను దిగ్విజయంగా పూర్తి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేయడం జరిగింది. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలోనే సుమారు 300 స్కూళ్లలో అత్యధికంగా క్రీడల్లో రాష్ట్ర స్థాయి మరియు జాతీయస్థాయికు కనితి పాఠశాల నుండి ప్రాతినిధ్యం వహించడం వల్ల 180 పాయింట్లు తో జిల్లాలోని ప్రథమ స్థానాన్ని కనితి పాఠశాల కైవసం చేసుకున్నందుకు విద్యార్థులను మరియు పాఠశాల సిబ్బందిను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయరామరాజు, సత్తిబాబు, వర్రే రాంబాబు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ,సూరిశెట్టి పెంటారావు, పోతల కృష్ణ,జాన్ రమేష్,భాగ్యలక్ష్మి, ఇందిరా ప్రియదర్శిని,దాలయ్య, మూర్తి,కళ్యాణ్ చక్రవర్తి, ఆదినారాయణ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మండల పశు వైద్యశాల

జిల్లాస్థాయి అధికారులు చొరవ చూపాలి

విశాలాంధ్ర - ఆనందపురం: మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థలో ఉంది. బయట లోపల పూర్తి చిందరవందరగా చిన్నపాటి వర్షానికి పెచ్చులూడిపోయి వైద్యశాలకు వచ్చే వారికి తరచు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. చాలా కాలం నాటి భవనాన్ని పూర్తిగా అధికారులు గాలికి వదిలేసారు. పశు వైద్యశాలకు వచ్చే వారి సంఖ్య పెరిగినప్పటికీ పట్టించుకోనే వారే లేరు. కనీసం మరమ్మతులైన చేసే నాథుడే లేడు. అధికారులు తనిఖీలు నిమిత్తం వచ్చినవారు భయభ్రాంతులకు గురవుతున్నారు. పశు సంవర్ధక శాఖ చైర్మన్ మండల కేంద్రానికి వచ్చినప్పటికీ కనీసం పక్కనే ఉన్నటువంటి ఈ వైద్యశాల వైపు పర్యవేక్షణ కూడా చేయలేదు. వైద్యశాలకు వచ్చే రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు చొరచూపి పరిష్కార మార్గం అని అన్వేషించాలని పాడి రైతులు కోరుతున్నారు.